# సహనానికి సరిహద్దు

### వల్లపు రెడ్డి

ఛీ, 'అబల' మీద చేయి చేసుకోవడం ఏం బావుంది? — అని బాధపడసాగాడు మాధవరావు. గడచిన ఆరుసంవత్సరాల కాపురంలో అతడెన్నడూ మాలతిపైని కన్నెఱ్ఱజేయలేదు. ఇవాళ ఎందుకో అతనికి తెలియకుండానే కోపం వచ్చేసింది. అదైనా మామూలుదికాదు; ఒళ్ళు తెలీక, ఎదుట ఉన్నది మనిషా, పశువా అనే విచక్షణ లేకుండా, ఆమె చెంప ఛెళ్ళుమనిపించాడు. అబ్బ ఎంతటి భయంకర దృశ్యమది? అది తలుచుకుంటే 'సబలుడు' అయిన తనకే ఒళ్ళు కంపించిపోతోంది. కొట్టడంతోనే ఆమె గిర్రున తిరిగి భూమ్మీద పడిపోయింది చైతన్యం లేనిదానిలా. శరీరమంతా చెమటలు పోసినై. ఆమెకు శ్వాస ఆడటంకూడా కష్టమైంది. పదిహేను నిమిషాలు ఉపచారం చేసేదాకా ఆమె కళ్ళు విప్పలేదు...

మాధవరావుకి ఆదృశ్యం ఇంకా కళ్ళ ముందే ఉన్నట్టుంది. అతడు లేచి కొట్టడంతోనే ఆమె కెవ్వున కేకవేసి పడిపోయింది. విజయదశమికి చెల్లెల్ని తీసుకుపోవడానికి వచ్చిన అతని శ్యాలకుడు మురళి అవతలి గదిలోంచి పరుగెత్తుకొచ్చాడు గాభ్రాలాగు, "ఏం జరిగింది చెల్లాయి?" అని అరుస్తూ. గదిలోకి వచ్చి, భూమ్మీద పడిఉన్న చెల్లెల్ని చూసి నిర్విణ్ణుడై పోయాడతడు. బావ అలా ప్రవర్తిస్తాడని మురళి కలలోనైనా అనుకొని ఉండడు. సంగతి సందర్భాలు ఏమిటో అర్థంకాక, "ఏమిటిబావా"?" అని అడిగాడు, మాధవరావు ముఖంలోకి తీక్షణంగాచూస్తూ. మాధవరావు కింకా పూర్వావేశం తగ్గలేదు. అదే స్థితిలో బావమరదిని, "నువ్వవతలికి వెళ్లు" అని కసిరాడు. అతడు మారు పలకకుండా అవతలి గదిలోకి వెళ్ళిపోయాడు భయంతో.

మురళి తక్షణం అలా వెళ్లిపోవడమే మంచిదైంది. అతడు ఇంకొక్క మాట నోటిగుండా రానిచ్చినా, అతని పని కూడా మాలతికి మల్లేనే ఐఉండేది. అతడు కిక్కురుమనకుండా అవతలికి వెళ్లడంతోనే మాధవరావులో అనుతాపం కలిగింది. వెంటనే మాలతిని ఎత్తి పడకమీద పడుకోబెట్టాడు. కూజాలోని చల్లని నీటితో ముఖసేచనం కావించాడు. "మాలతీ,మాలతీ" అని మెల్లగా పిలుస్తూ, మృదువుగా ఆమె భుజాన్ని కదుపుతూ శయ్య మీదే కూర్చున్నాడు. ఆమెకు పదినిమిషాల తరువాతగాని స్పృహరాలేదు. అంతసేపూ అతడు ఆమె గండభాగం మీద అచ్చుపడిపోయిన తన చేతి వ్రేళ్ళ కర్కశత్వాన్ని చూస్తూ కూర్చున్నాడు. నిజానికి అవి తన చేతి వ్రేళ్ళ ముద్రలుకావు, తన హృదయంలోని మౌఢ్యానికి ప్రతిబింబాలు- అని తన్ను తాను లోలోపలే నిందించుకోసాగాడు.

మాలతి కళ్ళుతెరచింది. సినిమాలో ప్రతిస్పర్థి అయిన క్రూర మాంత్రికుడి చేతిలో పడి, మూర్ఛజెంది, చివరకు మాంత్రికుడి భయంకరమైన గుహలో మతితెలిసిన నాయికలాగా "నేనెక్కడున్నాను?"అని ప్రశ్నించలేదు. వాచిపోయిన చెంపని ఒక చేత్తో తడిమి చూసుకుంటూ మాట్లాడకుండా లేచి నిలుచుంది. అతనికి విముఖమై. మాధవరావు కూడా లేచినిల్చుని "మాలతీ!" అన్నాడు పశ్చాత్తాపం ధ్వనించే కంఠంతో. ఆమె పల్కలేదు. అతడామె భుజాలు రెండూ పట్టుకున్నాడు తనవేపు త్రిప్పుకుందామనే ఉద్దేశంతో ఆమె కోపంతో వదల్చించుకుని అవతలిగదిలోకి వెళ్ళింది.

కొట్టినందుకు తనెంత బాధపడుతున్నాడో అర్థం చేసికోకుండా ఆమె అలా వెళ్లిపోవడంతో మాధవరావు మళ్లీ కోపావిష్టుడైనాడు. కాని, ఆ కోపం ఆట్టే కాలం ఆగలేదు. ఆమెను అనునయించడానికి అవతలి గదిలోకి పోవాలని రెండు మూడడుగులు వేశాడు ద్వారం వైపు. అవతల మురళి ఉన్న సంగతి జ్ఞాపకం వచ్చింది. అతని ఎదుటకి వెళ్ళలేక పోయాడు, మహాపరాధం చేసిన వాడిలాగు. అత్తణ్ణి కసిరాడు; అతనిచేత ఇన్నాళ్ళు మంచవాడనిపించుకుని, ఈ క్షణంలో చెడ్డవాడైపోయాడు. అవతలి గదిలోకి పోవడమెట్లాగు? సమాధానపరచడమెలాగు?— అని విచారిస్తున్నాడు.

ఎక్కడికన్నాయ్, ప్రయాణం?"-అవతలిగదిలోంచి మాలతి కంఠం. ఆమె స్వరంలో సన్నని జీర విన్పడింది.

"ఊరి కెడుతున్నానమ్మా."—మురళి జవాబు.

కొంతసేపటిదాకా మాటలేమీ విన్పడలేదు. మురళి కాబోలు పెట్టె సర్దుకుంటున్న చప్పుడు మాత్రం విన్పడింది. మాధవరావు దిగులుతో, కలతతో మౌనంగాఇవతలి గదిలో నేలకేసి చూస్తూ నిల్చుని ఉన్నాడు.

"అమ్మకూ, నాన్నకూ ఏమని చెబుతావు?" అని ప్రశ్నించింది మాలతి, ఐదు నిమిషాల తరువాత.

"ఏం చెబుతాను?"—కొంచం ఆగాడు మురళి. ఎందుకోగాని అతని మాటలలోని ధ్వనినిబట్టి పోల్చుకున్నాడు మాధవరావు. చెల్లెలి పరిస్థితినీ, బావ ప్రవర్తననీ చూసి అతని గుండె గాయపడి ఉంటుంది. తన్మూలంగా ఏర్పడిన గాద్గదికతచేత అతని కంఠంలోంచి మాటలు పెకలిరాలేదు. తర్వాత అన్నాడు: "ఆ పశువు పంపలేదని చెబుతాను" అని.

మాధవరావుకు 'పశువు' అనేమాట వినడంతోనే ఒక్క గంతులో అవతలి గదిలోకి దూకి, బావమరదిని ఫెడీఫెడీమని ఆ చెంపా ఈ చెంపా వాయించాలన్నంత కోపం వచ్చింది. కాని అది కళ్ళను మాత్రం చింతనిప్పులుగాచేసి ఆగిపోయింది.

"ఆయన పంపనని ఎప్పుడన్నారు?"— మాలతి అడిగింది.

"నోటితో అనాలా? పంపనూ అని, చూసింది చాలదా?"

మాలతి ఏమీ మాట్లాడలేదు.

"అయితే పద, వెడదాం."—అన్నాడు మురళి."

"నేనే రానన్నానని చెప్పు."—అంది మాలతి.

మళ్లీ కాస్సేపు నిశ్శబ్దం.

తరువాత మాలతి మాటలు విన్పడ్డాయి. "అన్నయ్యా, ఇవ్వన్నీ మనస్సులో ఏమీ పెట్టుకోకు. అమ్మకూ, నాన్నకూ నమస్కారాలు చెప్పు. నువ్వు పెద్దవాళ్ళతో ఈ సంగతులేమీ చెప్పకు. ఇది సర్వసామాన్యమే."

'సర్వసామాన్యమే' అనేమాట మాత్రమే మాధవరావు మనస్సులో బాణంలా గ్రుచ్చుకుంది. మాలతిని తను ఎప్పుడూ ఇలానే కొడ్తూ ఉంటాడని ఆ మాటలోని అంతరార్థం. ఇలా స్ఫురించేసరికి అతని కాళ్ళ క్రింద భూమి తొలగిపోయి నట్లనిపించింది.

# ★ సహానానికి సరిహద్దు ★

మాలతి మీద ఇంతకు ముందెన్నడూ అతడు చేయి చేసుకోలేదు. మాలతికీ తనకూ ఉన్న అన్యోన్యానురాగాలను బంధుకోటిలోని వారు చాలా మంది మెచ్చుకొంటూంటే విన్నాడు. ఆ పొగడ్తలకు కొన్ని కొన్ని సార్లు తానే ఉబ్బిపోయాడు. అలాగే మాలతీ. కాని మాలతి ఇవాళ తన విషయంలో ఇంతటి విరుద్ధమైన మాట, కేవలం అబద్ధం, చెబుతుందని కలలోనైనా ఊహించలేదు. మాలతిపైన అతనికి అవ్యాజమైన అనురాగమూ, నమ్మకా. ఇవాళ అనురాగం అంతర్థానమైంది; నమ్మిక వమ్మైపోయింది...అవతలికి వెళ్లి తనెన్నడూ అలా ప్రవర్తించలేదని చెప్పుకోవడమా? ఏది మార్గం?

అవతలి గదిలోంచి చాలాసేపటివరకు ఎవరి మాటలూ విన్పడలేదు. మురళి వెళ్లిపోయి ఉంటాడని నిర్ణయించుకున్నాడు. ఐనా, అతడు మాలతివద్దకు వెళ్లి ఆమె తన అన్నకు ఇచ్చిన వాఙ్మూలంలో నిజమేమీ లేదని మందలించలేక పోయ్యాడు. ఆ గదిలోనే టేబుల్ ముందు కూర్చుని, ఇంతటి వైపరీత్యం సంభవించడానికి మూలం ఏమై ఉంటుందా అని ఆలోచించడం మొదలెట్టాడు.

మాలతి చాలా ఉత్తమురాలు. ఎన్నడూ అతని కెదురు చెప్పలేదు. వంట చెయ్యడంలో అతనికేవి ఇష్టమో తెలిసికొంటేగాని వంటచెయ్యదు. స్వీయ అలంకరణ విషయంలోకూడా స్వాతంత్ర్యం వహించదు. ఫలానా చీర నీకు బాగులేదు అంటేసరి, వెంటనే దాన్ని మార్చివేస్తుంది. అయితే అతడుమాత్రం ఆమెకు దేంట్లో తీసిపోతాడని? అతనూ భార్యావిధేయుడే. అతనికి ఇష్టమున్నా లేకున్నా 'ఇవాళ సినిమాకి వెళదామండీ' అని ఆమె అంటేసరి, అతడు కిమ్మనకండా తయారౌతాడు. సాయంత్రం మిత్రులతో కలిసి ఎక్కడికి తిరుగవెళ్ళినా సరే, ఆమె ఆజ్ఞానుసారం ఆరున్నరకల్లా ఇంట్లో ఉండితీరాల్సిందే. ఇరువురికి చెందిన ఈ దృశమైన పూర్వోత్తరాలనుబట్టి చూస్తే ఎవరూ నేరస్థులుకారు. ఇద్దరికిద్దరూ పరస్పరం విధేయులూ, సాత్వికులూ. అయితే మాధవరావు అంతటిదెబ్బ ఆమెను కొట్టడానికి కారణం ఏమైఉంటుంది? ఆమె అతని మనస్సుకి కష్టంకలిగించే విధంగా ప్రవర్తించి ఉండాలి. లేకపోతే ఏదో కారణంవల్ల అతడే, సహనం తక్కువై, విజృంభించి ఉండాలి.

......విజయదశమి వారంరోజు లుందనగానే బావమరది వచ్చాడు తన చెల్లెల్ని తీసికెళ్ళడానికి. మాధవరావు మామూలుగానే, "రెండురోజు లాగవోయ్, తీసికెడుదువుగాని, ఇప్పుడే వెళ్ళి ఏం జేస్తావ్". అన్నాడు. సినిమాలూ వినోదాలూ చూసి, మరీ పోవచ్చునని ఆగాడు మురళి. రావడంతోనే 'ఈసారి బావనికూడా తీసుకురమ్మన్నారు అమ్మా నాన్నలు' అని చెల్లెలితో చెప్పిఉంచాడు.

మాధవరావు పెళ్ళిజరిగింతరువాత అత్తవారింటికి చాలా అరుదుగా వెళ్ళాడు. వాళ్ళింట్లో ఏదో గొప్పకార్యం జరిగితేనే కాని, ఉత్తవేళలం దెప్పుడూ వెళ్ళలేదు. గడచిన ఆరు సంవత్సరాల కాలంలో నాలుగు మార్లుమాత్రమే వెళ్ళాడు. అత్తవారిది సమిష్టి కుటుంబం. కనుక, మాలతి పెదనాన్నగారి రెండోకూతురు పెళ్ళికీ, చిన్నన్నగారి పెద్దబ్బాయి పెళ్ళికీ, మురళి పెళ్ళికీ, చివరని మాలతి చెల్లెలి పెళ్ళికీ......ఇలా మొత్తం నాలుగుసార్లువెళ్ళాడు. చివరిసారివెళ్ళి రెండు సంవత్సరాలయింది. అత్తామామలు ఇంతవరకు ఎన్నిమార్లు రమ్మని వేడినా అతను వెళ్ళలేదు. మాలతినిమాత్రం వాళ్లు కోరినప్పుడల్లా పంపాడు. మాధవరావు అత్తవారింటికి తరచుగా వెళ్ళకపోవడం మూలాన్ని అతనికి ఆ కుటుంబంలో కొండంత గౌరవం పెరిగిపోయింది. చెల్లెల్ని తీసుకుపోవడానికి వచ్చిన మురళి, "నీవూ రావాలి బావా!" అన్నాడు. మాధవరావు సమాధానం చెప్పకండా మందహాసం చేశాడు.

మరుదినం మాలతి అంది: "ఏమండీ, మిమ్మల్ని కూడా రమ్మన్నారట అమ్మా నాన్నలు. తప్పకండా రావాలీమారు" అని.

మాధవరావు ఆఫీసులో సెలవుపెట్టి పోవాలనే అనుకున్నాడు. అంచేత, "చూద్దాంలే"- అన్నాడు.

"చూద్దాంలే, అనడంతో సరిపోదు. తప్పకండా రావాలి. అన్నిమార్లు బ్రతిమాలుతూ కబురెట్టినా రాకపోతే వాళ్లుబాధపడతారు."

"ఇప్పుడేమిటి ప్రత్యేకత? మరోసారి వస్తాను."

"అహాఁ, కుదరదు. దసరాకి అల్లుళ్ళందరూ వస్తున్నారట. మీరొక్కరు లేకపోతే ఏం బాగు? అమ్మా నాన్నలు చిన్నబుచ్చుకుంటారు."

అత్తామామల కోరిక నెరవేర్దామని మాధవరావు సెలవుకొఱకు భగీరథ యత్నాలు చేశాడు. కాని, పై అధికారి ససేమిరా వీలు లేదన్నాడు. ఎలాగైనా అతణ్ణి ప్రసన్నుడిని చేసి సెలవు సంపాదించాలని మూడు రోజులు తిప్పలు పడ్డాడు. అతడెంతకూ అనుజ్ఞ ఇవ్వలేదు. అప్పటికే ఇద్దరు ముగ్గురు సెలవుమీద ఉన్నారని అతడు ఒప్పుకోలేదు. అంచేత మాధవరావు బాధపడ్డాడు. చిరకాలంగా అత్తామామలు కోరుతున్న కోరికను చెల్లించ


# మలబద్ధకము

## మిమ్ము క్రుంగదీయుచున్నదా?




ఔను, మలబద్ధకము చాలా బాధకలిగించు వ్యాధి. అది మిమ్ము క్రుంగదీస్తుంది, మాంద్యం కలిగిస్తుంది. నిరుత్సాహం చేస్తుంది ...

బ్రూక్‌లాక్స్
మిమ్ము రాత్రికి రాత్రి
సరిదిద్దును
(వెస్ట్ మినిస్టర్ లాబొరేటరీస్ లిమిటెడ్, లండన్ వారి నిర్మాణము)
ఏజంట్లు:
ఓరియంటల్ ఫార్మస్యూటికల్ ఏజన్సీ,
మద్రాసు-1.
బ్రాంచి: 17/117, నాగేశ్వరరావురోడ్, విజయవాడ-2.

BMA 20

డానికి అవకాశం కల్పించని అధికారిమీదా, స్వాతంత్ర్యంలేని తన బ్రతుకుమీదా కుత కుతగా ఉందతనికి.

అప్పటికే మూడు రోజులు గడచినాయి. ఆనాడు సాయంత్రం ఆఫీసునించి వచ్చాక మాలతి అతని గదిలో ప్రవేశించి, "ఏమండీ, రాత్రికి బయల్దేరదామా?" అనడిగింది.

"నేను రాను మాలతీ! నువు వెళ్లు"—అన్నాడతడు.

"అయితే నేనూ వెళ్ళను. అన్నయ్యను పొమ్మంటాను."

"అదికాదు మాలతీ! నాకు సెలవు దొరకదు. నేను రాలేను. నువ్వయినా వెళ్ళకపోతే అత్తమామలు బాధపడతారు." అన్నాడు మెత్తగా.

"మీరు రాకూడదనే ఉద్దేశంలో ఇలా అంటున్నారు. లేకపోతే మీకు సెలవు దొరక్కపోవడ మేమిటండీ, మాటలుకాక?"

మాలతికి తనఇబ్బంది ఎలా తెలియ జెప్పాలో మాధవరావుకి బోధపడలేదు. "నేను నిజం చెబుతున్నాను మాలతీ! ఆఫీసరు సెలవు ఇవ్వనన్నాడు. ధిక్కరించి వెళ్ళితే నడవడికి భంగం. నా మాట విను." అన్నాడు చివరికి.

ఆమె అర్థంచేసికోలేదు. "నన్నుకూడా వెళ్లవద్దంటే ఏపీడా ఉండదుగా"—అంది రూక్షంగా.

తన హృదయాన్నీ, పరిస్థితినీ అర్థంచేసికోవడానికి ప్రయత్నించని భార్యమీద అతనికి ఎక్కడలేనికోపం వచ్చింది. ఆఫీసరుపైనా, తన నిస్సహాయతపైనా అదివరకే కలిగిన కోపాన్నికూడా దాంతో జోడించాడు. ఒళ్ళుతెలీని ఆవేశంలో కుర్చీలోంచి లేచి మాలతిని సత్తువకొద్దీ చెంపమీద...ఆ తరువాత జరిగినదంతా విశదమే.

ఐతే ఇందులో తప్పు ఎవరిది? భర్త పరిస్థితుల్ని అవగాహనం చేసికోలేక, అతణ్ని రమ్మని పట్టుబట్టి, విసిగించి, అతడిని ఆ స్థితికి తెచ్చిన మాలతిదా? లేక భార్యకు సరియైన విధంగా తన పరిస్థితులను తెలియజెప్పలేక, ఆమెని ఒడంబరుపలేని మాధవరావుదా? ఈ సమస్యకు తుదా మొదలూ లేదు. ఎన్నటికీ పరిష్కారంలేదు దీనికి.

అన్న వెళ్ళిపోయిం తరువాత మాలతి అవతలి గదిలోనే కూర్చుని జరిగిన ఘట్టాన్ని ఊహించుకొంటోంది. ఎక్కువసేపు అందు గురించి ఊహించే ఆస్కారం లేకపోయిందామెకు. భర్త గుణగణాలు ఇలాటివని ఒకరు చెప్పనక్కర్లేదు మాలతికి. తన మాటల మూలాన్ని అతనికి ఆగ్రహం కలుగుతుందని ఆమెకు మొదటే తెలుసు. ఆగ్రహం ద్వారా అతడు ఆఫీసులో సెలవు దొరక్కపోయినా ఎట్లాగో, తనను సంతృప్తి పరచడానికైనా, ఊరికి బయల్దేరుతాడని తలంచింది. కాని, అతనికి కలిగిన ఆగ్రహానికి పరిణామం ఇలా అవుతుందని ఆమె అనుకోలేదు.

అన్నవెంట తనుకూడా వెళ్ళిఉంటే బావుండేది—అనుకుందామె. ఇక్కడే ఆగిపోయినందుకు భర్తకు ఇంకా కోపం హెచ్చిందేమో! అన్నయ్య వెళ్ళి అమ్మానాన్నలతో తను రానికారణం చెబుతాడు. ఏమని? బావ పంపలేదని. వాళ్ళు విచారిస్తారు....నిజానికి ఆయన పంపననలేదు. ఆయన రాకపోతే తనుకూడా వెళ్ళనని మంకుపట్టుపట్టి నిలిచింది మాలతి. అత్తామామల దృష్టిలో తను దయారహితుడుగా, నీతిలేనివాడిలా కన్పడతాడని ఆయన బాధపడతాడు. దీని కంతకీ కారణం ఆమే. అతడు రావంటే, అతని స్వభావమే అంత అని సరిపుచ్చుకుని ఆమె వెళ్ళి వుండాల్సింది. అదీగాక ఆయన ఈ స్వభావం క్రొత్తది కాదు; ఆరు సంవత్సరాలుగా చూస్తున్నదే.. ఏమో! జరిగిందేదో జరిగింది. ఇక మిగిలిందంతా ఒక్కటే ఎలాగైనా భర్తని మంచి చేసికోవడం.

అప్పటికే సాయంత్రం ఆరున్నర దాటిపోయింది. మాలతి లేచి లైటు స్విచ్‌లని ఆన్ చేసింది. భర్తగదిలోకి అడుగులు వేసింది మెలమెల్లగా. పరధ్యానంగా కుర్చీలో కూర్చుని ఉన్న ఆయన జుట్టులోకి తన సన్నని, తామరతూడుల్లాంటి వ్రేళ్ళని పోనిచ్చి, చిలిపిగా కెలుకుతూ, "లేవండి, భోంచేద్దురుగాని."-అంది మృదువుగా.

మాధవరావు తలను వెనక్కి త్రిప్పిచూశాడు.

మాలతి కన్పడింది. వాచినచెంప అలాగే ఉంది. కాని, ఆమెముఖం మాత్రం మందహాససుందరంగా ఉంది. ఆ ముఖం చూసి, మాధవరావు విస్మయ చకితుడైనాడు. మాలతికి తనమీద కోపం కలిగిఉండొచ్చునని ఊహించాడు. ఏరీతిగా ఆమెను సమాధాన పరచుకోవాలో ఆలోచిస్తున్నాడు. ఏ విధానమూ గోచరంకాక మథనపడుతున్నాడు. అలాంటి సంధిసమయంలో వెదుకబోయిన తీగలాగు-ఆడబోయిన తీర్థంలాగు-ఆమే వచ్చి మృదూక్తులతో, కలువలా విప్పారినవదనంతో, చనవుగా పల్కరించేసరికి గత

(56-వ పేజీ చూడండి)

FPY. 26-TEL

'నా గొంతుక బాగా
పుండు పడినందున
నేనుమ్రింగలేక పోయాను'

కాని పెప్స్

ఉపశమనం కలిగించి
పుండును మాన్పినవి



పెప్స్ టేబ్లెట్లు గొంతు, రొమ్ము బాధోపశమన నివారకసారములు కలవి, మీరు పెప్స్‌ను చప్పరించునపుడు ఈ సారములు ఆవిరి అయి, మీ శ్వాసద్వారా గొంతుకలోనికి, శ్వాసమార్గం, శ్వాసకోశాలలోనికి కొనిపోబడుతాయి. ఇలా అవి సరాసరి మిమ్ము బాధించే భాగాలను చేరుకుంటాయి. అందుకే పెప్స్ అంతశక్తివంతమై, జగద్విఖ్యాతిగాంచినవి. పెప్స్ దగ్గులను అణిచివేస్తాయి, గొంతు పుండు బాదను ఉపశమింప జేస్తాయి, కఫమును కోసివేసి, శ్వాసబాధను పోగొట్టుతాయి. ఇన్‌ఫ్లుయేంజా, బ్రోంకైటిస్ చికిత్సకు ఇవి అమోఘమైనవి.



PEPS

పెప్స్ గొంతు, రొమ్ము టేబ్లెట్లు.
మందులమ్మేవారి అందరివద్దా లభిస్తాయి.

సోల ఏజెంట్లు. దాదా & కో; 86, నైనప్పనాయక్ వీధి, మద్రాసు-

# సహానానికి సరిహద్దు

(19-వ పేజీ తరువాయి)

విషయాన్ని మరచి, కరిగి నీరైపోయాడు అతడు. పెల్లుబికిన ఆనందంతో లేచి, "మాలతీ!" అని కౌగిలించుకున్నాడామెను. ఆమె నుదుటిని ముద్దు పెట్టుకున్నాడు. ఆమె పరవశురాలయింది.

భోజనాలు ముగిసింతరువాత మాధవరావే కదిపాడు గత గాథని "మాలతీ, మీ అన్నయ్య ఏమనుకుంటాడో ఊహించావా?" అని.

"దేన్ని గురించి?"

"నీవు చెప్పిన అబద్ధాన్ని నిజంగా నమ్మి"

"ఏమిటా అబద్ధం?"

"ఈసంగతి పెద్దవాళ్ళతో చెప్పవద్దనీ, ఇది సర్వసామాన్యమేననీ చెప్పావుకదా మీ అన్నకు."

మాలతి కొంచం రోచించి, తనమాటలో ఎంత అర్థం ఉందో తెలుసుకుని విస్తుపోయింది. "మీరూహించిన అభిప్రాయంలో నే నామాటను అనలేదు. ఎప్పుడు రమ్మన్నా మీరు రాకపోవడం సర్వసామాన్యమే నన్నాను. మీరు నామీద కోప్పడ్డారని చెప్ప వద్దన్నాను పెద్దలకు."-అంది. మళ్ళీ ఆమే అన్నది. "అన్నయ్య మీరూహించినట్లే ఇంట్లో ప్రచారం చేసే అవకాశం ఉంది. వాళ్ళేమనుకున్నా ఫరవాలేదు. మీతప్పేముంది ఇందులో? నేను సంజాయిషీ చెప్పుకుంటాను లెండి." ఆమె చిరునవ్వు నవ్వింది.

మనమిద్దరమూ లేకపోతే వాళ్ళెంత బాధపడతారో! మీ పెదనాన్నా, బాబాయీ వాళ్ళవాళ్ళ అల్లుళ్ళనీ, కూతుళ్ళనీ చూసి ముచ్చటపడుతుంటే వాళ్ళ హృదయాలు ఎంత వేదన చెందుతాయి?"—మాధవరావు హృదయస్పందనం ఈమాటల్లో వ్యక్తమైంది

"అవును మీరన్నట్లు నేనైనా వెళ్ళకపోవడం తప్పైపోయింది."

కొంత తడవు ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు.

"నేను మనిషిగా ప్రవర్తించలేకపోయాను మాలతీ!"అంటూ ఆయన పరితప్త కంఠస్వరం నిశ్శబ్దాన్ని ఛేదించింది.

"ఇక మీ రాశ్చేసేపు గత గాథల్ని త్రవ్వకండి. నేను సహించలేను" అని ఆమె పడకలు సర్దటానికి లేచి వెళ్ళింది.

* * *

వారంరోజుల తరువాత మాధవరావు ఆఫీసునుండి ఇంటికి రావడంతోనే మాలతి నవ్వుతూవచ్చి, "ఏమండోయ్! మనకలహం గొప్ప ప్రయోజనాన్నే సాధించింది" అంది.

"అదేమిటి మాలతీ?" అని ప్రశ్నించాడు ఆశ్చర్యంతో.

"ఏముంది? మంచివాళ్ళమని పేరుపడశీన మనమే కీచులాడుకోబట్టి, మీ పెదనాన్నగారు సుమతిని అత్తింటికి పంపారు."

"అలాగా!"

ఆమె ఏమీ అనకండా రెండుత్తరాలు తీసి అతనికిచ్చింది బల్ల డ్రాయర్ లోంచి. ఒకటి విప్పి చదువుకున్నాడు.

అమ్మాయీ, మాలతీ!

నీపట్ల అల్లుడు ఎలా ప్రవర్తించినదీ మురళి ద్వారా విని గుండెలు నీళ్ళయిపోయినాయి. నీలాంటి ఉత్తమురాలికి ఉత్తముడైన భర్త లభించాడని మేమందరమూ సంతోషపడ్డాం కాని నీ బ్రతుకుకూడా కత్తితో సాములాగే ఉందని ఇన్నాళ్ళూ తెలిసికోలేకపోయాం.

భర్త మంచివాడు కాడనీ, తలిదండ్రుల చెప్పుడు మాటలకు చెవి ఒగ్గి, భార్యను చావబాదుతుంటాడనీ ఇన్నాళ్ళూ అమ్మాయిని, నీ చెల్లెలు, సుమతిని, ఇంట్లోనే ఉంచుకున్నామా అత్తవారింటికి పంపకండా? ఇప్పుడు నీ స్థితితో పోల్చిచూస్తే సుమతి బ్రతుకే కొంత మెరుగనిపిస్తూంది. తలిదండ్రుల సంతృప్తి కోసం అప్పుడప్పుడు కొట్టినా, చివరకు లాలించి, భార్యని వోదార్చవచ్చు భర్త. కాని, ఎవ్వరి అదుపులూ, ఆజ్ఞలూ లేని మాధవరావు నీలాటి దాన్ని అర్థం చేసికోకండా హింసపెడుతున్నాడంటే మాగుండెలు దహించుకుపోతున్నాయి.. ఏది ఎలా ఉన్నా సుమతిని ఇవాళే అత్తింటికి పంపుతున్నాము. నువ్వు మాత్రం భర్తతో జాగ్రత్తగా మెలగుతల్లీ! అంతా నోసటిరాతలు.

—మీ పెదనాన్న."

రెండో ఉత్తరాన్ని చదువుకో సాగాడు మాధవరావు. "చిరంజీవి మాలతిని ఆశీర్వదించి.

మీ అన్నయ్య చెప్పాడు ఏం జరిగిందీ. నీమీది మమకారం కొద్దీ మీ అమ్మ అల్లుని ప్రవర్తనకు విచారిస్తూంది. కాని. నిష్పాక్షికంగా ఆలోచించి చూస్తే నువ్వే అతణ్ణి విసిగించి, ఆ స్థితికి తెచ్చి ఉంటావని తోస్తూందినాకు. నీపక్షాన నేను వాదించడం లేదని కోప్పడకు. అల్లుని హృదయం నాకు బాగా తెలుసు. అతడి మెత్తని హృదయం, నడవడీ, లోకంలో ఎవరికీ లేవు. అతనికి పనులుండి, రాలేనని చెప్పి ఉండొచ్చు. అంతమాత్రాన్నే నీవతణ్ణి ఏవో కూటిపోటి మాటలని బాధపరచి ఉంటావు.

పండుగనాడు అందరూ కూతుళ్ళనీ, అల్లు[illegible]ంబరపడుతూంటే మాకు [illegible] [illegible] దట్లో. కాని, వాళ్ళ[illegible]ళ్ళలో నిన్నూ, వాళ్ళఅల్లుళ్ళలో మాధవరావునీ చూడగలిగిన తరువాత కొంచం సంతోషపడ్డాం...దీపావళికైనా ఇద్దరూ రండి. సెలవుపెట్టాల్సిన అవసరం లేదని చెప్పు అల్లునికి. పండగ రేపనగా రాత్రికి రండి; ముగిసిన మర్రోజే వెడుదురుగాని.

ఇంతకూ నీకు తండ్రినైనందుకు వాత్సల్యపూర్వకముగా నీకు చెప్పేచివరిమాట ఇది: నీవు 'అతనిహృదయాన్ని అర్థం చేసికోవడానికి ప్రయత్నించు. అతడు మాత్రం పూర్తిగా విజ్ఞానం లేనివాడా? నిన్ను పూర్తిగా అర్థం చేసుకుంటాడు. అల్లునికి ఆశీర్వాదాలు.

మరో విషయం. మీ పెదనాన్నా, బాబాయి ఇద్దరూ నీవైపే ఉన్నారీ విషయంలో. దసరాకి ఆహ్వానిస్తే వచ్చిన అల్లుని వెంట సుమతిని పంపారు.. పరిస్థితులు ఎలా ఉన్నదీ త్వరగా ఉత్తరం వ్రాయి. లేకుంటే మీ అమ్మకి దిగులు పోదు ఎదురు చూస్తుంటాను.'

—"మీ నాన్న"

ఉత్తరాలను రెంటినీ చదివి మాధవరావు తనలో తాను భావగర్భితంగా, నవ్వుకున్నాడు.

"ఏమండీ, నాన్నగారు మీ పక్షానికే చెందారు. ఎంతైనా మగవాళ్ళు మగవాళ్ళే" అన్నది మాలతి నవ్వుతూ.

"కనీసం మామగారైనా 'నన్ను సమర్థించినందుకు బ్రతగ్గలిగాను."—అన్నాడు అతడు వ్యంగ్యం ధ్వనించేట్లు.

ఇద్దరూ నవ్వుకున్నారు.

ఇంటినిండా నవ్వుల వెన్నెల. ★

## తెల్ల వెంట్రుకలుండవు

(GOVT REGD)

రంగులనుచూచి మోసపోవద్దు,అది తాత్కాలికము మా సువాసన "మన్ మోహిని హేర్ అయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది. 50 సం॥ల వయస్సువరకు వెండ్రుకలను నల్లగా వుంచును ఇదిగాక మెదడుకు చల్లదనము నిచ్చును. ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. "జ్ఞాపకశక్తి"ని కంటిచూపును వృద్ధిచేయును, కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు 5-0-0 3 సీసాలు రు.12-0-0, సగము నెరసివుంటే ఒక సీసా రు. 6-0-0. 3 సీసాలు రు. 15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/- లు 3 సీసాలు రు. 18/- లు. పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి సూచీ.

GENERAL LABORATORIES;
(P. W) P. O. Rajdhanwar (H. Bhag.).

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.